## మూడు ఇళ్లల్లో చోరీ చేసిన వ్యక్తి

న్యూఢిల్లీ: కుంభమేళాకు వెళ్లేందుకు ఖర్చుల కోసం ఒక వ్యక్తి మూడు ఇళ్లల్లో చోరీలు చేశాడు. బంగారు ఆభరణాలు, ఖరీదైన వస్తువులను దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదులపై దర్యాప్తు చేసిన పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. అరవింద్ అలియాస్ భోలా తన స్నేహితులతో కలిసి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లాలని భావించాడు. ప్రయాణ ఖర్చులకు కావాల్సిన డబ్బు కోసం చోరీలకు పాల్పడ్డాడు. జనవరి 17న దక్షిణ ఢిల్లీలోని రాజ్‌పురి ప్రాంతంలో మూడు ఇళ్లల్లో దొంగతనాలు చేశాడు. ఖరీదైన వస్తువులు, నగలను అపహరించాడు.

%కాగా, మూడు ఇళ్లల్లో జరిగిన దొంగతనాలపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దర్యాప్తు చేశారు. అరవింద్ అలియాస్ భోలాను నిందితుడిగా గుర్తించి అతడ్ని అరెస్ట్ చేశారు. పోలీసులు ప్రశ్నించగా స్నేహితులతో కలిసి కుంభమేళాకు వెళ్లేందుకు ఖర్చుల కోసం మూడు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పాడు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :286 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 24-01-2025 | పేజీలు:4 వెల: 2.00


## కొనసాగుతున్న ఐటీ సోదాలు




హైదరాబాద్: సినీ ప్రముఖుల ఇండ్లలో వరుసగా మూడో రోజూ ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. పలు సినీ సంస్థలకు ఫైనాన్స్ చేస్తున్న వారి నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇక పుష్ప డైరెక్టర్ సుకుమార్ ఇంట్లో రెండో రోజు కూడా ఐటీ అధికారులు పత్రాలు పరిశీలిస్తున్నారు. అదేవిధంగా నిర్మాత నెక్కంటి శ్రీధర్ నివాసంతోపాటు ఇటీవల విడుదలైన భారీ బడ్జెట్ సినిమాల ఇండ్లలో సోదాలు కొనసాగుతున్నాయి.

సోమవారం ఉదయం ప్రముఖ నిర్మాత దిల్ రాజు తోపాటు మైత్రి మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా కార్యాలయాల్లో అధికారులు ఏకకాలంలో దాడులు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం కూడా దిల్ రాజు, మైత్రీ మూవీస్ నిర్వాహకులు యెర్నేని నవీన్, యలమంచిలి రవిశంకర్ ఇండ్లు, కార్యాలయాల్లో ఐటీ బృందాలు తనిఖీలు చేశాయి. ఇక ఐటీ దాడులపై దిల్ రాజు స్పందించారు. ఐటీ సోదాలు నా ఒక్కడిపైనే జరుగడం లేదని, ఇండస్ట్రీ మొత్తం సోదాలు కొనసాగుతున్నాయని తెలియజేశారు. తాను విజయ్‌తో తెరకెక్కించిన వారిసు (వారసుడు) సినిమా రూ.120 కోట్లు మాత్రమే వసూళ్లు చేసిందని దిల్ రాజు ఐటీ అధికారులకు చెప్పినట్టు తెలిసింది. అంతేకాదు విజయ్‌కు రూ.40 కోట్లు రెమ్యునరేషన్ ఇచ్చాం. ఈ సినిమాకు వచ్చిన నష్టాలను పూడ్చేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు రూ.60 కోట్ల నష్టపరిహారం చెల్లించామని చెప్పినట్టు సమాచారం. సోదాల్లో భాగంగా ఇప్పటికే ఐటీ అధికారులు దిల్ రాజు భార్య తేజస్వినిని బ్యాంక్‌కు తీసుకెళ్లారు. ఈ విషయమై తేజస్విని మాట్లాడుతూ.. బ్యాంకు వివరాలు కావాలని అధికారులు అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించామని చెప్పారు. ఇక, ఇప్పటికే ఐటీ అధికారులు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ , మైత్రీ మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థలు ఆయా సినిమాలకు పెట్టిన పెట్టుబడులు, ఆదాయాలపై ఆరాతీస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్.

## మావోయిస్ట్ అగ్రనేత చంద్రహాస్ మృతి



హైదరాబాద్: గరియాబాద్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత ప్రమోద్ అలియాస్ చంద్రహాస్ చనిపోయినట్లు భద్రతా బలగాలు ప్రకటించాయి. చంద్రహాస్ ఒడిశాతోపాటు ఈస్ట్ జోనల్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారని అధికారులు వెల్లడించారు. ఆయనపై రూ.20 లక్షలకుపైగా రివార్డు ఉన్నది తెలిపారు. రెండు రోజుల క్రితం ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఇందులో 16 మంది మావోయిస్టులు చనిపోయారు. వారిలో దశాబ్దాల పాటు భద్రతా దళాలకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న మావోయిస్టు అగ్రనేత జయరాం రెడ్డి అలియాస్ చలపతి కూడా ఉన్నారు. తాజాగా చంద్రహాస్‌ను హతమార్చినట్లు పోలీసులు వెల్లడించారు.

%చంద్రహాస్ అలియాస్ పాండన్న అలియాస్ ప్రమోద్ హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన వారు. 1985లో గద్దర్ టీమ్‌లో కొంతకాలం పనిచేసిన చంద్రహాస్.. ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రారంభంలో జననాట్య మండలిలో పనిచేశారు. గిరిజనుల పక్షాన నిలబడి వారికి సన్నిహితంగా ఉంటూ మాడ్ ఉద్యమానికి బీజం వేశారు. ప్రస్తుతం ఆయన మావోయిస్టు పార్టీ డీకేఎస్ జేడీసీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. మాడీ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల పథకాలను పక్కాగా అమలు చేయడంలో ఆయనే కీలక పాత్ర పోషించేవారని తెలుస్తున్నది.

## తిరుమలలో యథావిధిగా సర్వదర్శనం టోకెన్లు



తిరుమల: తిరుమలలో సర్వదర్శనం టోకెన్ల జారీ మళ్లీ ప్రారంభమైంది. గురువారం తెల్లవారుజాము నుంచి తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, విష్ణు నివాసం, శ్రీనివాసం వద్ద టోకెన్లను టీటీడీ అధికారులు యథావిధిగా ఇస్తున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జనవరి 10 నుంచి 19 వరకు టికెట్లు, టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. వైకుంఠ ద్వార దర్శనాలు ముగియడంతో రెండు రోజులుగా తిరుమలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఎస్?ఎస్?డీ టోకెన్ల జారీని టీటీడీ నిలిపివేసింది. వారందరిని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2లోకి అనుమతించి శ్రీవారి దర్శనం కల్పించారు. వారి దర్శనాలు ముగిసిన నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఏరోజుకారోజు సర్వదర్శనం టోకెన్ల పంపిణీని టీటీడీ పునఃప్రారంభించింది.

%నేడు తిరుమలలో అధ్యయనోత్సవాలు ముగియనున్నాయి. ఇవి 2024 డిసెంబర్, 30వ తేదీన ప్రారంభమైన విషయం తెలిసిందే. జనవరి 25న సర్వ ఏకాదశి, 27న మాస శివరాత్రి, 29న శ్రీ పురంధర దాస ఆరాధన మహోత్సవ వేడుకలు జరగనున్నాయి.

మరోవైపు శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులను టోకెన్లు లేకుండా అనుమతించడంపై టీటీడీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఎస్ఎస్‌డీ టోకెన్లు దక్కించుకోవడానికి భక్తులు పడరానిపాట్లు పడుతున్నారు. అనంతరం దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉండటం కూడా సమస్య అవుతున్నది. దీంతో టోకెన్లు లేకుండా దర్శనాలు కల్పించడంపై అధికారులు ఆలోచిస్తున్నారు.

## ఆక్రమణల కూల్చివేతను.. పాతబస్తీ నుంచి ప్రారంభించండి: ఎమ్మెల్యే దానం



హైదరాబాద్: హైదరాబాద్‌లో ఫుట్‌పాత్‌ల కూల్చివేతలపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చివేతలపై అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పేద ప్రజల జీవనాధారాన్ని అధికారులు ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాలసీ ఉంటే పబ్లిక్ నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారంటూ ప్రశ్నించారు. అధికారులు చేసే పనులతో తాము ప్రజల మధ్య తిరుగలేకపోతున్నామని చెప్పారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల కూల్చివేతను పాతబస్తీ నుంచి ప్రారంభించాలన్నారు. హైదరాబాద్ ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. మాదాపూర్‌లో కుమారీ అంటీకి ఇచ్చిన మినహాఇంపును అధికారులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. %చింతల్‌బస్తీలో ట్రాఫిక్ పోలీస్-జీహెచ్ఎంసీ సంయుక్తంగా రోప్ కింద రోడ్డు ఆక్రమించి చేపట్టిన వందకుపైగా నిర్మాణాలను బుధవారం కూల్చివేశారు. ఇండ్లు కోల్పోయిన వారంతా రోజువారీగా పొట్టపోసుకునే చిరు వ్యాపారులే. దీంతో అక్కడకు వచ్చిన దానం నాగేందర్ ఒకింత ఆవేశానికి గురయ్యారు. స్థానిక ఎమ్మెల్యే నోటీసులో లేకుండా కూల్చివేతలు ఎలా చేపడతారు? ఆపకపోతే ఇక్కడే బైఠాయిస్తా.. ఎమ్మెల్యే పదవి పోయినా సరే జేసీబీకి అడ్డంగా కూర్చుంటానని హెచ్చరించారు. 'దావోస్‌లో ఉన్న సీఎం వచ్చే వరకు రెండ్రోజులు ఆగండి.. ప్రజలకు నేను కదా సమాధానం చెప్పుకోవాల్సింది.. కూల్చివేస్తే బాగుండదు..' అంటూ ఘాటుగా మాట్లాడారు. కానీ ఇదంతా పది నిమిషాల్లో ముగిసింది. అధికారులు మాత్రం క్షణం పాటు కూడా కూల్చివేతలు నిలిపివేయలేదు. గత 40 ఏండ్లుగా ఇక్కడే ఉంటూ బతుకుదెరువు సాగిస్తున్న తమ షాపులను తొలగిస్తే రోడ్డునపడుతామంటూ స్థానికులు రోదించినా.. అధికారులు కూల్చివేతలను ఆపలేదు.

## మంచి చేయాలని చూస్తుంటే అడ్డుకుంటున్నారు



యాదాద్రి: తెలంగాణ రాష్ట్రంలో అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలని చూస్తుంటే బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకుంటున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేని సిగ్గులేని నేతలు గ్రామసభలకు అడ్డుతగులుతున్నారని మంత్రి ఘాటుగా స్పందించారు. దీక్షలు, నిరసనల పేరుతో అడుగడుగునా అడ్డం పడుతున్నారని తుమ్మల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పదేళ్ల విధ్వంస పాలనకు గురైన రాష్ట్రాన్ని ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. అందుకే తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు రుణమాఫీ చేసినట్లు చెప్పుకొచ్చారు. అన్నదాతలకు మేలు చేస్తుంటే నల్లగొండలో రైతు దీక్ష చేస్తున్నారంటూ మంత్రి తుమ్మల నిప్పులు చెరిగారు. నల్లగొండ రైతు దీక్ష చేయాలని భావిస్తున్న బీఆర్ఎస్ నేతలు పదేళ్లపాటు అధికారంలో ఉండి రైతులకు రుణమాఫీ ఎందుకు చేయలేదని మంత్రి నిలదీశారు. జనవరి 26 నుంచి అన్నదాతలకు రైతు భరోసా ఇవ్వనున్నట్లు మంత్రి తుమ్మలమరోసారి గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డును తాకట్టుపెట్టి కొంతమంది రైతులకు రైతు బంధు వేశారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో దొడ్డు బియ్యం మాఫియా ఉందని, అందుకే ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తీసుకువస్తారని మంత్రి తుమ్మల ధీమా వ్యక్తం చేశారు.

మంత్రుల జోక్యం ఉండదు..

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మంత్రులుగా తమ జోక్యం ఉండదని, న్యాయంగా అర్హులైన వారందరికీ మంజూరు చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అధికారులు ప్రజాపాలన సభల్లో ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తిస్తారని మంత్రి తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ 15వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం జరిగేలా సాఫ్‌వేర్ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ.2 లక్షలకు పైగా ఇంకా రుణమాఫీ కాని రైతులకు మార్చి నెలలో షెడ్యూల్ పెట్టి రుణమాఫీ చేస్తామని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉందని, ముందు సమస్యలను అధికారులు, తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజా సమస్యలు పరిష్కరించడం తన బాధ్యతంటూ మంత్రి పొన్నం చెప్పారు.

## ఐటీ ఇండస్ట్రీలో ఉండాలంటే నిజమైన ప్రతిభ.. అంకితభావం అవసరం



హైదరాబాద్: ఐటీ పరిశ్రమలో ఉండాలంటే నిజమైన ప్రతిభ, విద్య, అంకితభావం చాలా అవసరం.. కానీ సంచుల కొద్ది డబ్బులతో ఎమ్మెల్యేలను కొనడానికి, ఢిల్లీ బాసులకు డబ్బులు పంపించడానికి ఇలాంటివాటితో పనిలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఐటీ ఉద్యోగుల మేధస్సు, అవిశ్రాంత శ్రమే ఆధునిక సాంకేతిక ప్రపంచానికి వెన్నెముక అని చెప్పారు. వారే లేకుంటే ప్రగతి రథచక్రాలు ఆగిపోతాయన్నారు. కేటీఆర్ ఐటీ ఎంప్లాయ్ కాబట్టి ఎంప్లాయ్ మైండ్‌సెట్‌తో ఆలోచిస్తాడు. నేను పొలిటీషియన్‌ని, పాలసీ మేకర్‌ని.. నాకు అన్ని తెలవాల్సిన అవసరం లేదంటూ దావోస్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు.

'తనను ఓ ఐటీ ఉద్యోగి అంటూ తక్కువ చేసి మాట్లాడొచ్చని అనుకునేవాళ్లకు ఒకటే చెప్పదలచుకున్నా. ఐటీ పరిశ్రమలో ఉండాలంటే నిజమైన ప్రతిభ, విద్య, అంకితభావం చాలా అవసరం. కానీ సంచుల కొద్ది డబ్బులతో ఎమ్మెల్యేలను కొనడానికి, ఢిల్లీ బాసులకు డబ్బులు పంపించడానికి ఇవేమీ అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు ఎంతో కష్టపడి వారి జీవనోపాధిని పొందుతున్నారు. ఐటీ, ఐటీ అనుబంధ సంస్థల్లో ఉన్న నా అక్కాచెల్లెళ్లకు, అన్నాదమ్ముళ్లకు సలాం. మీ మేధస్సు, అవిశ్రాంత శ్రమే ఆధునిక సాంకేతిక ప్రపంచానికి వెన్నెముక. మీరు లేకుంటే ప్రగతి రథచక్రాలు ఆగిపోతాయి. మీ విద్యార్హతలకు, మీ నిబద్ధతకు కొందరు యాక్సిడెంటల్ రాజకీయ నాయకులు సరితూగరు. అలాంటి వాళ్లు ప్రవేశపెట్టే అనాలోచిత విధానాలకు మనం భారీ మూల్యం చెల్లించుకుంటున్నాం. నా విద్యార్హతలు, నా ఉద్యోగ అనుభవం, ఐటీలో నా నేపథ్యం.. ముఖ్యంగా ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగులు నాకు ఎప్పటికీ గర్వకారణం.' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## కీలక ఒప్పందాలు.. లక్షల కోట్లల్లో పెట్టుబడులు



హైదరాబాద్, జనవరి 23: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన విజయవంతంగా పూర్తైంది. దావోస్‌లో తెలంగాణకు పెట్టుబడులు వెల్లువెత్తాయి. మూడు రోజుల దావోస్ పర్యటనలో భాగంగా పలు దిగ్గజ కంపెనీల అధిపతులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా వారిని కోరారు. అలాగే పలు కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా ముందుకు వచ్చాయి. తెలంగాణాకు భారీగా పెట్టుబడులు ఆకర్షించడంలో తెలంగాణ రైజింగ్ బృందం సక్సెస్ అయింది. మొత్తం పది కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందాలు చేసుకుంది. %దాదాపు రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. కొత్త ఒప్పందాలతో 46 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత రికార్డు స్థాయిలో పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. గత ఏడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అయితే గత ఏడాదితో పోలిస్తే పెట్టుబడులు మూడింతలు మించాయని చెప్పుకోవచ్చు. మరోవైపు ఈరోజుతో సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ముగియనుంది. ఈరోజు సాయంత్రం దావోస్ పర్యటన ముగించుకొని స్వరాష్ట్రానికి రేవంత్ రెడ్డి బృందం పయనంకానుంది. హైదరాబాద్‌కు సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ రైజింగ్ బృందం చేరుకోనుంది.

## బయటపడిన భారీ ఆయుధాల డంప్

రాయ్‌పూర్: భద్రతా బలగాల ఆపరేషన్లు, ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. వరుస ఎదురుకాల్పుల్లో భారీగా క్యాడర్‌ను కోల్పోతున్న మావోయిస్టులు.. మరోపక్క పోలీసుల కూంబింగుల్లో ఆయుధ డంప్‌లను కనుగొంటున్నారు. గత శనివారం ఛత్తీస్‌గఢ్‌లోని మల్కన్‌గిరి జిల్లాలో ఆయుధ డంప్ బయటపడిన విషయం తెలిసిందే. తాజాగా సుక్మా జిల్లాలో కూడా మరో డంప్‌ను భద్రతా బలగాలు కనుగొన్నాయి. జిల్లాలోని దుల్లేడ్, మెట్టుగూడ అటవీ ప్రాంతంలో 203 కోబ్రా బెటాలియన్, సీఆర్పీఎఫ్ 131 బెటాలియన్ సిబ్బంది కూంబింగ్ చేపట్టాయి. %ఈ క్రమంలో మెట్టుగూడ గ్రామం నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఒక గుహను కనుపెట్టారు. అందులో పరిశీలించగా 21 ఐఈడీలు, మల్టీ బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్ ఒక జనరేటర్ సెట్, లాత్ మెషిన్ పరికరాలు, భారీ మొత్తంలో పేలుడు తయారీ పదార్థాలు, తుపాకీ తయారీ పరికరాలు, వైద్య సామాగ్రి ఉన్నాయి. భద్రతా బలగాలు భారీ ఆయుధ డంప్‌ను స్వాధీనం చేసుకోవడంతో మావోయిస్టులకు పెద్ద ఎదురుదెబ్బ తగినట్లయింది. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో మంగళవారం కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో చనిపోయిన 16 మంది మావోయిస్టులు చనిపోయిన విషయం తెలిసిందే. వారిలో దశాబ్దాల పాటు భద్రతా దళాలకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న మావోయిస్టు అగ్రనేత జయరాం రెడ్డి అలియాస్ చలపతి కూడా ఉన్నారు.



## అంతస్తు నుంచి దూకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



అమరావతి : ఏపీలోని అనంతపురం జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య కలకలం రేపుతుంది. చరణ్ అనే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి నారాయణ కళాశాలలో చదువుతున్నాడు. గురువారం కళాశాలలో తరగతులు నడుస్తుండగా, అందరూ చూస్తుండగానే బయటకు వచ్చి మూడవ అంతస్తు రేలింగ్ నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో చనిపోయాడు. అయితే విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు కళాశాల ఎదుట ఆందోళనను నిర్వహించాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కళాశాల ఎదుట బందోబస్తును ఏర్పాటు చేశారు.

## కమ్మేసిన పొగమంచు.. కాల్వలోకి దూసుకెళ్లిన కారు

హైదరాబాద్ : రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తగ్గి చలితీవ్రత నానాటికి పెరుగుతుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో పాఠశాలలు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు చలికారణంగా గజగజ వణికిపోతున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పొగమంచు కారణంగా యాదాద్రి, భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని కాల్వపల్లి వాగులో కారు ప్రమాదానికి గురైంది. పొగమంచు రోడ్డును కప్పేయడంతో వాగులోకి కారు దూసుకెళ్లింది. కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లి మండలంలో ఉదయం 9 గంటల వరకు పొగమంచు దగ్గలేదు. వరంగల్ రహదారిపై రోడ్లు పొగమంచుతో వాహనాలు కనిపించక ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాహనదారులు వాహనాలకు లైట్లు వేసుకుని వేగాన్ని తగ్గించుకుని ప్రయాణం చేశారు. హైదరాబాద్ నగరంలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పటాన్‌చెరులో 9.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. రాజేంద్రనగర్ 10.5, ఖమ్మంలో 18, రామగుండంలో 12.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెరిగిన చలి, కాలుష్యం వల్ల చిన్నారులు, వృద్ధులు శ్వాస సంబంధిత సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు.

## సంపాదకీయం

**శుక్రవారం, 24, జనవరి, 2025**

# సౌత్ సొమ్ములతో నార్త్... సోకులు

జనాభా తగ్గడం వల్ల దక్షిణ భారత రాష్ట్రాలకు సమీప భవిష్యత్ లో చాలా రకాలుగా నష్టాలు, సవాళ్లు ఎదురవబోతున్నాయి. ఇక్కడి వ్యాపార గ్యాప్, ఉద్యోగాల గ్యాప్ ను ఉత్తరాది రాష్ట్రాలు ఫిలప్ చేసే ఛాన్సెస్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే అది చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఫ్లంబింగ్ దగ్గరుంచి హౌస్ కన్స్ట్రక్షన్, ఐటీ దాకా నార్త్ జనమే సౌత్ లో పెరుగుతున్నారు. ఇక సౌత్ స్టేట్స్ లో వ్యాపారాలు చేసేందుకు రాజస్థాన్, యూపీ సహా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వలస వస్తున్నారు. మంచి పొజిషన్ కు వెళ్తున్నారు. కారణం ఇక్కడ భారీ గ్యాప్ ఉండడమే. వాళ్ల రాష్ట్రాల్లో పోటీ ఎక్కువుండడం, జనాభా ఎక్కువుండడంతో సౌత్ కు తరలి వస్తూనే ఉన్నారు.రైట్ ఈ ఏడాది జనగణన జరగబోతోంది. ఇది 2026 దాకా కొనసాగుతుంది. ఆ లెక్కల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన ఉండబోతోంది. అంటే జనం ఎక్కడ ఎక్కువుంటే అన్నేసి నియోజకవర్గాలు పెరుగుతాయన్న మాట. అదే జరిగితే జనం తక్కువగా ఉన్న సౌత్ లో నియోజకవర్గాల్లో పెద్దగా మార్పు ఉండదు. అదే టైంలో నార్త్ లో ముఖ్యంగా యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి చోట్ల విపరీతమైన జనాభాతో ఎక్కువ సీట్లు పెరిగే అవకాశం ఉంటుంది. సీట్లు ఒక్కటే కాదు? నిధుల పంపిణీ కూడా జనాభా ఆధారంగానే జరుగుతుంది. ఇప్పుడు కూడా అలాగే నడుస్తోంది. అందుకే సౌత్ స్టేట్స్ చాలా టెన్షన్, అటెన్షన్ తో ఉన్నాయి. కేంద్రం నుంచి అందాల్సిన నిధులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి.జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాదికి తీరని అన్యాయం జరుగుతుందని, దక్షిణాది-ఉత్తరాది అనే చర్చ వచ్చే ఆస్కారం ఉంది కాబట్టి కేంద్ర ప్రభుత్వమే దీనికి స్పష్టమైన విధాన రూపకల్పన చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటి నుంచో చెబుతున్నారు. దేశ జనాభాలో సౌత్ స్టేట్స్ 18 శాతమే ఉన్నా.. జీడీపీలో వాటా 35శాతంగా ఉంది. అంతెందుకు తలసరి ఆదాయం విషయంలో జాతీయ సగటు కంటే దక్షిణాది రాష్ట్రాలే టాప్. కానీ ఏం లాభం? కేంద్ర నిధుల పంపిణీ మాత్రం జనాభా ఎక్కువున్న రాష్ట్రాలకే ఎక్కువ అన్న ఫార్ములా టోటల్ గా ఎఫెక్ట్ చూపుతోంది.1 970ల్లో కేంద్ర ప్రభుత్వం జనాభా నియంత్రణ కార్యక్రమాలు చేపట్టింది. వీటిని సౌత్ స్టేట్స్ పక్కాగా అమలు చేసి అభివృద్ధికి బాటలు వేశాయి. కానీ ఉత్తరాది రాష్ట్రాలు జనాభాను కంట్రోల్ చేయలేకపోయాయి. అదుపు చేసుకోకుండా పెంచుకుంటూ వెళ్లాయి. ఇదే ఇప్పుడు సమస్యగా మారుతోంది. జనాభాను నియంత్రించుకుని ఇప్పుడు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. జన సంఖ్య అదుపు చేసుకోలేకపోయిన ఉత్తరాది రాష్ట్రాలు లాభపడే సీన్ ఏర్పడింది. అందుకే జనాభా ప్రాతిపదికన నిధుల బట్వాడా కాకుండా ఆర్థికంగా మంచి పర్ఫార్మెన్స్ చూపే ఆధారంగా ఇవ్వాలంటున్నారు. అది జరగాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 81కు సవరణ చేయడం ద్వారా దక్షిణ భారత రాష్ట్రాలు నష్టపోకుండా కొత్త ఫార్ములా తీసుకురావాలి. కానీ ఇది చేసేదెవరు? దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల వాదన వినేదెవరన్న చర్చ జరుగుతోంది.. జనవరి నెలకు గానూ కేంద్రపన్నుల్లో రాష్ట్రాల వాటాను ఎలా పంపిణీ చేసిందో? మొత్తం లక్షా 73 వేల 30 కోట్లను 28 రాష్ట్రాలకు డిస్ట్రిబ్యూట్ చేసింది. ఇందులో బిమారూ స్టేట్స్ అని నాలుగు రాష్ట్రాలకు పేరుంది. అవి బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్. ఇందులో బిహార్ కు ఏకంగా 17 వేల 403 కోట్లు, మధ్యప్రదేశ్ కు 13,582 కోట్లు, రాజస్థాన్ కు 10 వేల 426 కోట్లు, ఇక ఉత్తరప్రదేశ్ కు ఏకంగా 31 వేల 39 కోట్లు పంచింది కేంద్రం. ఇది 2025 జనవరి పన్నుల వాటా లెక్కలు. ఇందులో టాప్ త్రీలో బిమారూ రాష్ట్రాలైన యూపీ, బిహార్, మధ్యప్రదేశ్ ఉన్నాయి. మరి ఆ రాష్ట్రాల నుంచి కేంద్రానికి వెళ్లింది గోరంత. తీసుకున్నవి కొండంత.సిన్న మొన్నటిదాకా భారత్ కు యువతే బలం, యువశక్తి ఎక్కువున్న దేశం అంటూ అంతా మాట్లాడుకునే వారు. కానీ ఇప్పుడు అది తగ్గుతోంది. ఇకపైనా తగ్గుముఖమే పడుతుందని పరిస్థితులు చెబుతున్నాయి. అందుకే గతంలో జనాభా నియంత్రణ అన్న వారే ఇప్పుడు కనండి బాబూ కనండి అంటున్నారు. కథ మార్చాల్సిన టైం వచ్చిందంటున్నారు. లేకపోతే పెను నష్టం తప్పదంటున్నారు. జనాభా పెరగకపోతే నిజంగానే అంత పెద్ద నష్టం ఉందా?జనాభా లెక్కల విషయంలో చైనా నుంచి మొదలు పెడుదాం. ఒకప్పుడు చైనా ప్రపంచంలోనే ఎక్కువ జనాభా ఉన్న దేశంగా ఉండేది. కానీ భారత్ దాన్ని అధిగమించింది. సీన్ కట్ చేస్తే ఇప్పుడు వరుసగా మూడో ఏడాది చైనాలో జనాభా తగ్గిపోయినట్లు లెక్కలు రిలీజ్ చేసింది. దీంతో అక్కడ భయాలు పెరుగుతున్నాయి. ఎందుకంటే ఓవైపు వృద్ధుల జనసంఖ్య పెరుగుతోంది. అదే సమయంలో పని చేసే యువత సంఖ్యలో తగ్గుదల స్పష్టంగా కనిపిస్తోంది. చైనా ఒక్కటే కాదు తూర్పు ఆసియాలో, జపాన్, సౌత్ కొరియా, హాంకాంగ్ లోనూ జనాభా పడిపోయింది. ఇందుకు కారణం పెరుగుతున్న ఖర్చులు, విద్య, ఉద్యోగం అనే సరికి పెళ్లిళ్లు, ఆ తర్వాత సంతానాలు వాయిదా పడుతున్నాయి. చైనాకు బలం ఆ దేశ జనాభానే. ప్రపంచంలో ప్రస్తుతం రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ఇది ఫస్ట్ ప్లేస్ కు రాకముందే వృద్ధుల సంఖ్య పెరిగి రివర్స్ అవుతుందన్న భయాలు వారిని వెంటాడుతున్నాయి. 2100 నాటికి చైనా జనాభా 73 కోట్లు ఉంటుందన్న అంచనాలు ఆ దేశ ఆర్థికవ్యవస్థకు పెను సవాళ్లే.ఇప్పుడు మనదేశం విషయానికొద్దాం. కొన్ని రాష్ట్రాల్లో విపరీతంగా జనాభా ఉంటే ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం తగ్గుతోంది. సో ఆటోమేటిక్ గా జనాభా ఎక్కువున్న రాష్ట్రాల్లో విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు లేని వారంతా దక్షిణ భారత రాష్ట్రాలకు విపరీతంగా వలస వస్తున్నారు. ఇక్కడున్న జనాభా గ్యాప్ ను వలసలతో ఫిల్ చేస్తున్నారు. ఇది శాశ్వత పరిష్కారం కాదు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా సౌత్ ఇండియన్ స్టేట్స్ కట్టుదిట్టంగా ఆ రూల్ ను ఫాలో అయ్యాయి. ఇంటికి ఒకరు లేదా ఇద్దరి వరకే సంతానాన్ని సరిపెట్టారు. కానీ ఇప్పుడు అలాగే ఉంటే కుదిరే పరిస్థితి కనిపించడం లేదు. అందుకే ఏపీ సీఎం చంద్రబాబు ప్రతి సందర్భంలోనూ ఇదే మాట మాట్లాడుతున్నారుజనాభానే అసలైన ఆస్తి అన్నది ప్రస్తుతం డౌన్ ట్రెండ్ లో ఉన్న చైనా ఆందోళన చూస్తే అర్థమవుతోంది. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆందోళన చూస్తే అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే జనాభా లేకపోతే ఏ పనీ చేయలేని పరిస్థితి. సంపద సృష్టి, మ్యాన్ పవర్ జెనరేషన్ ఇవన్నీ తగ్గి మ్యాటర్ లేకుండా పోతుంది. ఇద్దరు పిల్లలకు మించి ఉన్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధనను కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఉమ్మడి ఏపీలో తీసుకొచ్చారు. కానీ ఇప్పుడు దాన్ని తీసేస్తామని పిల్లలు లేని వారికి పోటీకి అనర్హత విధిస్తామంటున్నారు చంద్రబాబు.భారత జనాభా 2060ల నాటికి గరిష్ట స్థాయికి చేరుకుంటుందని, ఆ తర్వాత అది క్రమంగా తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఒక్కరిద్దరినే కనాలి. వారికి మంచి చదువు, మంచి ఆరోగ్యం, మంచి భవిష్యత్ కల్పించేలా చూసుకోవాలన్న కాన్సెప్ట్ తో చాలా మంది ఉంటున్నారు. ఇవాళ్టి రోజుల్లో కాస్ట్ ఆఫ్ లివింగ్ చాలా పెరిగింది. ఎంత సంపాదించినా డైలీ ఖర్చులకే సరిపోతుండడంతో మధ్యతరగతి జనం చాలా వరకు ఒకరిద్దరు సంతానంతోనే సరిపెడుతున్నారు. ఈ రోజుల్లో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మందిని కనేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. ఎందుకంటే ఆ స్థాయి ఖర్చులను భరించే స్తోమత ఉండడం లేదు. కానీ ఇది దేశానికే అందులోనూ సౌత్ ఇండియాకు పెద్ద ఎత్తున నష్టం కలిగించే పరిణామంగా మారుతోందిజనాభా పెరుగుదల విషయంలో ఇప్పుడు కొత్త విషయాలు బయటికొస్తున్నాయి. ఈ ఏడాది జనగణన జరిగే అవకాశం ఉంది. ఆ ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపులు ఉండబోతున్నాయి. దాంతో దేశానికి ఎక్కువ సంపాదించి పెడుతున్న దక్షిణాది రాష్ట్రాలైనా ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక విపరీతంగా నష్టపోయే ముప్పు ఎదుర్కొంటున్నాయి. అందుకే జనాభా పెంచాలని చంద్రబాబు, స్టాలిన్ అంటున్నారు. మరోవైపు జనాభా ప్రకారం కాకుండా రాష్ట్రాల పన్నుల వాటా ఆధారంగా నిధుల డిస్ట్రిబ్యూషన్ ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వాదిస్తున్నారు.

# పశ్చిమ నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం

## పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**వరంగల్**

వరంగల్ పశ్చిమ నియోజక అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. న్యూ బస్టాండ్ రోడ్ హనుమాన్ టెంపుల్ దగ్గర హన్మకొండ 10వ డివిజన్ లో మూడున్నర కోట్లతో స్మార్ట్ సిటీ లో భాగంగా రోడ్లు మరియు డ్రైనేజ్ పనులకు వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి మరియు కార్పోరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సంద ర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎలాంటి అభివృ ద్ధికి నోచుకోని 10వ డివిజన్ ని కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొన్ని డివిజన్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఇకముందు కూడా ఇంకెన్నో అభివృద్ధి పనులను చేపట్ట బోతున్నామని అన్నారు.

పశ్చిమ నియోజకవర్గ అభి వృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నడుస్తుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. దశల వారిగా అన్ని వార్డులలో సైడ్ డ్రైన్, సీసీ రోడ్ల పనులను చేస్తున్నా మని రోడ్డు నిర్మాణ పనుల్లో స్థానిక కాలనీ వాసులు ప్రభుత్వానికి సంహరించాలని కోరారు. కాలనీలలో ఎటు వంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరలో పరిష్కారం చేస్తానని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రేటర్ వరంగల్ కు మరిన్ని నిధులు తీసుకొచ్చి వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తానని అన్నా రు.ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్,రోహిత్ సింగ్ టాగూర్ తోట పవన్, 10 డివిజన్ అధ్యక్షులు శోభన బోయిన కుమార్ యాదవ్, సైండ్ల శ్రీకాంత్, మంద రాకేష్, పల్లం రమేష్, మాడిశెట్టి సతీష్, జఫర్ ఖాన్ ,షేక్ యాకూబ్, నజీర్ బాయ్, శశి గౌడ్, ఠాకూర్ రాజ్ కుమార్ సింగ్ ఠాకూర్, నారాయణ సింగ్, నిలేశ్వర్ సింగ్, బజరంగ్ సింగ్, సోమిరెడ్డి సాబ్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల రవికుమార్, తోట ప్రకాష్ అంబటి కుమార్ స్వామి, తోట శ్రీనివాస్, కరువు దశరథం, తోట శ్రీనివాస్, బొల్లం అశోక్ , బండారి మహేందర్, ఫోన్ లక్ష్మణ్ తదతరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో బీదర్ గ్యాంగ్...

హైదరాబాద్, : హైదరాబాద్ నడిబొడ్డున పోలీసులపై కాల్పులు జరిపి తప్పించుకున్న బీదర్ గ్యాంగ్ కోసం వేట కొనసాగుతోంది. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపడుతున్నారు. కాల్పులు జరిపిన నిందితులు బోర్డర్ దాటిపోకుండా కట్టడి చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని చెక్ చేస్తున్నారు.బీదర్ పోలీసులపై బీదర్‌కు చెందిన నిందితులు కాల్పులు జరిపారు. బస్‌లో కాల్పులు జరపడంతో సంచలనంగా మారింది. ఇది వేరే రాష్ట్రానికి చందిన వారు అయినప్పటికి హైదరాబాద్‌లో జరగడంతో తెలంగాణ పోలీసులకు ఈ కేసు ప్రతిష్టాత్మకంగా మారిపోయింది. అందుకే బీదర్ పోలీసుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్న పోలీసులు వారి ఇచ్చిన క్లూస్ ఆధారంగా విచారణ చేపట్టారు. కర్ణాటకలోని బీదర్‌లో ఏటీఎం వాహనంపై కొందరు దుండగులు అటాక్ చేసి నగదు మాయం చేశారు. 93 లక్షలతో ఉడాయించారు. వాళ్ల ఫోన్‌లు ట్రాప్ చేసిన పోలీసులు వారంతా హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించారు. అందుకే వారిని పట్టుకునేందుకు బీదర్ పోలీసులు హైదరాబాద్ వచ్చారు. అఫ్జల్ గంజ్‌లోని ఓ ట్రైవెల్స్ ఆఫీస్ వద్ద పోలీసులను చూసిన దుండగులు కాల్పులు జరిపాడు. బీదర్‌లోని శివాజీ చౌక్ మధ్యాహ్నం దోపిడీ జరిగింది. ఓ ఏటిఎంలో నగదు నింపేందుకు డబ్బులు తీసుకొస్తున్న సిబ్బందిపై ఇదే ముఠా కాల్పులు జరిపి డబ్బులు ఎత్తుకెళ్లింది. అక్కడ ఓ బైక్‌పై పారిపోయారు. ఈ కాల్పుల్లో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. మరో వ్యక్తి కూడా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. అలా బీదర్‌లో చోరీకి పాల్పడిన దుండగులు బైక్‌పై హైదరాబాద్ వచ్చారు. వారి కదలికలను సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా తెలుసుకున్న పోలీసులు వారంతా హైదరాబాద్‌లో ఉన్నట్టు తేల్చారు. తీరా వాళ్లు వచ్చి గాలింపు చర్యలు చేపడుతుంటే వారిపైనే కాల్పులు జరిపి రెండు రాష్ట్రాల పోలీసులకకు మోస్ట్ వాటెండ్‌గా మారిపోయారు. ఇదే విషయాన్ని బీదర్ పోలీసుల నుంచి స్టేట్మెంట్ తీసుకున్న హైదరాబాద్ పోలీసులు అణువణువూ గాలిస్తున్నారు. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి మాట్లాడుతూ నిందితుల కోసం ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు నాలుగు బృందాలు ఫామ్ చేసినట్టు వెల్లడించారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని గాలిస్తున్నామని అన్నారు.ఆయుధాలు అక్రమంగా అమ్మే వ్యక్తిని పట్టుకొని 24 గంటలు గడవక ముందే ఇలా కాల్పులు జరగడం పోలీసులు హై అలర్ట్ అయ్యారు. బుధవారం నేరేడ్‌మెట్ రాచకొండ కమిషనరేట్ పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణ యాదవ్ అనే పాతికేళ్ల కుర్రాడిని అరెస్టు చేశారు. రాంపూర్ బోహాలో ఉండే ఈ వ్యక్తి ఆరేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చాడు. ఇక్కడ సంపాదన ఖర్చులకు సరిపోవడం లేదని మళ్లీ ఊరెళ్లిపోయాడు. అక్కడే ఆయుధాలు విక్రయించే గ్యాంగ్‌తో చేతులు కలిపాడు. షాపూర్ గ్రామానికి చెందిన సంపత్‌యాదవ్ వద్ద రూ.20వేలకు .32ఎం.ఎం, ఒక తపంచా, 10 బుల్లెట్లు కొన్నాడు. వాటిని అమ్మి సొమ్ము చేసుకోవాలనుకున్నాడు. విషయాన్ని గ్రహించిన పోలీసులు అరెస్టు చేశారు. ఇది జరిగిన 24 గంటల్లోనే కాల్పులు పోలీసులను పరుగులు పెట్టించాయి.

# నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్..

## పవన్ కల్యాణ్‌కు కాంపిటీషన్ ఇచ్చేందుకేనా?



**అమరావతి,:** ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు ఓ కొత్త డిమాండ్ హాట్ టాపిక్‌గా మారింది. ఏపీ సీఎం చంద్రబాబు తనయుడు, మంత్రి నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని తెలుగు తమ్ముళ్ల నుంచి కొద్దిరోజులుగా పెద్ద ఎత్తున డిమాండ్ వినిపిస్తుంది. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరుకు చెందిన టీడీపీ కార్యకర్తలు కొంతకాలంగా ఈ డిమాండ్ వినిపిస్తుండగా.. తాజాగా వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి సభలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి ఏకంగా తన కోరికను చంద్రబాబు ముందు ఉంచారు. నారా లోకేశ్‌ను ఉప ముఖ్యమంత్రి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.నిజానికి ఏపీ కేబినెట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నంబర్ టూ పొజిషన్‌లో ఉన్నారు. అధికారికంగా ఎక్కడికి వెళ్లినా పవన్ కల్యాణ్‌కే ప్రాధాన్యత దక్కుతున్నది. దీంతో పవన్ కల్యాణ్ కంటే ఒక మెట్టుపైనే ఉండాలని లోకేశ్ ఆరాటపడుతున్నట్లు తెలుస్తోంది. అది కాకుండా తన తర్వాత తన కొడుకునే నంబర్ టూ పొజిషన్‌లో చూడాలని చంద్రబాబు కూడా అనుకుంటున్నట్లు సమాచారం. కానీ పవన్ కల్యాణ్ మాత్రం కూటమి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. పేరుకు కూటమిలో ఉన్నప్పటికీ ఇండిపెండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. తప్పు చేసింది కూటమి నేతలైనా సరే నిలదీస్తున్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని.. రాష్ట్రంలో శాంతి భద్రతలు సరిగ్గా లేవని.. దీన్ని చక్కబెట్టేందుకు అవసరమైతే హోం శాఖను తానే తీసుకుంటానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇటీవల వైకుంఠ ద్వార దర్శనం టికెట్లకు సంబంధించిన క్యూలైన్లలో తొక్కిసలాట జరిగిన ఘటనలోనూ పవన్ కల్యాణ్ దూకుడుగా స్పందించారు. టీటీడీ ఈవో, చైర్మన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా పవన్ కల్యాణ్ వ్యవహరిస్తున్న తీరు చంద్రబాబు, లోకేశ్ సహా తెలుగు తమ్ముళ్లకు మింగుపడటం లేదు. కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ ఇప్పటికే కీలకంగా మారిపోయారు. ఇప్పుడు చంద్రబాబు తర్వాత నంబర్ టూ ఎవరంటే పవన్ కల్యాణ్ పేరే వినిపిస్తుంది. పైగా క్షేత్రస్థాయిలో కూటమి నాయకులు లోకేశ్ కంటే కూడా ఎక్కువగా పవన్ కల్యాణ్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే పవన్ కల్యాణ్ జనసేన పార్టీ కేడర్ ఓ రేంజ్‌లో బలపడిపోతుంది. ఇది లోకేశ్ రాజకీయ ఎదుగుదలతో పాటు టీడీపీపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని చంద్రబాబుతో సహా తెలుగు తమ్ముళ్లు భావిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అలా అని పవన్ కల్యాణ్‌ను హోదాను తగ్గించే పరిస్థితి లేదు. పవన్ కల్యాణ్‌పై ఎంత కోపం వచ్చినప్పటికీ పొత్తు కారణంగా వాళ్లు ఏమీ అనలేకపోతున్నారు. పైగా బీజేపీ , ప్రధాని మోదీతో చంద్రబాబు కంటే పవన్ కల్యాణ్‌కే ఎక్కువ సాన్నిహిత్యం ఉంది. దీంతో పవన్ కల్యాణ్‌ను డైరెక్ట్‌గా టచ్ చేసే పరిస్థితి లేదు. కాబట్టి పవన్ కల్యాణ్‌కు ధీటుగా లోకేశ్‌కు సమాన హోదా ఇస్తే బాగుంటుందని తెలుగు తమ్ముళ్లు భావిస్తున్నారు. నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడం వల్ల పవన్ కల్యాణ్ క్రేజ్‌కు క్షేత్రస్థాయిలో కొంచెంలో కొంచెమైనా చెక్ పెట్టవచ్చని టీడీపీ నాయకులు భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. వాస్తవానికి డిప్యూటీ సీఎం పదవి అనేది చట్టబద్ధం కాదు. ఒకరిద్దరికే పదవి ఇవ్వాలని కూడా లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ కేబినెట్‌లో ఐదుగురు మంత్రులకు డిప్యూటీ సీఎం హోదా ఇచ్చారు. అంతకుముందు చంద్రబాబు హయాంలో కూడా ఒకరికంటే ఎక్కువ మందికి ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చారు. కానీ ఇప్పుడు మాత్రం పవన్ కల్యాణ్ ఒక్కడే డిప్యూటీ సీఎం పదవిలో ఉన్నారు. కాబట్టి నారా లోకేశ్‌కు కూడా డిప్యూటీ సీఎం ఇస్తే వచ్చే నష్టమేమీ లేదు. అందుకే తెలుగు తమ్ముళ్ల నుంచి ఈ వాదనను బలంగా తీసుకొస్తున్నారు. ఇప్పటికే ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు నుంచి టీడీపీ నాయకుల నుంచి ఈ వాదన వినిపించగా.. తాజాగా వైఎస్ఆర్ జిల్లాలో కూడా టీడీపీ నేతల నుంచి ఈ వాదనను తీసుకొచ్చారని అనుకుంటున్నాయి. మరి నిజంగా పవన్ కల్యాణ్‌కు కాంపిటీషన్‌గా లోకేశ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారో లేదో చూడాలి.

## పాఠశాల విద్యార్థులకు షిటీం అవగాహన సదస్సు

**సిరిసిల్ల** మండల కేంద్రం బెజ్జంకిలోని గీత ఉన్నత పాఠశాలలో సిద్దిపేట సిపి అనురాధ ఆదేశం మేరకు షిటీం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన సదస్సును నిర్వహించినట్లు బెజ్జంకి ఏఎస్ఐ శంకర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా షిటీం సభ్యులు బాలికలకు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. బాలికల భద్రత షిటీం యొక్క లక్ష్యమని వారు తెలిపారు. పాఠశాల ఆవరణలో కానీ, బయటకాని, ఎవరైనా ఆకతాయిలు బాలికలను భయాందోళన గురిచేసిన, వేధించిన, ఇబ్బంది కలిగించిన, తక్షణమే 100 లేదా 181 నంబర్లకు కాల్ చేయాలని తెలిపారు. బాలికలపై ర్యాంగింగ్ ఈవ్ టీజింగ్, వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదు చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ మోసాల పట్ల గురికాకుండా నేటి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు సైతం తమ తమ ఇళ్లల్లో తల్లిదండ్రులు సైబర్ నేరాల ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు తెలపాలని కోరారు. చిన్నచిన్న విషయాలకు విద్యార్థులు ఆవేదనకు గురి కావద్దని, మంచి ఆలోచనతో చదువుకోవాలని వారు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తన పై కూడా దృష్టి సారించి, విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది, గీతా పాఠశాలల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

**వరంగల్**

భారతీ విద్యా భవన్ స్కూల్ ఆవరణంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించుటకు నెహ్రూ యువ కేంద్ర వరంగల్ జిల్లా అధికారి చింతల అన్వేష్ ఆదేశాల మేరకు ఈ యొక్క ఆటల పోటీలను నిర్వహించ డం జరుగుతుంది. నిర్వహించే క్రీడలు యువకులకు వాలీబాల్ గ్రూప్ రన్నింగ్ షెటిల్ సింగిల్స్ పోటీలను నిర్వహించడం జరుగుతుంది. యువతులకు కబడ్డీ గ్రూప్ షటిల్ సింగిల్స్ రన్నింగ్ పోటీలను నిర్వహించ డం జరుగుతుంది. ఈ యొక్క ఆటలు ఆడే క్రీడాకారుల వయస్సు 18 నుండి 29 వయసు గల యువతి యువకులు పాల్గొనవచ్చని తెలియజేయడం జరుగు తుంది. కావున పర్వతగిరి మండల పరిధిలో యువతీ యువకులు పాల్గొనవచ్చు మరియు గెలుపొందిన విన్నర్స్ కి సర్టిఫికెట్ మరియు మెమొంటోను ఇవ్వడం జరుగుతుంది కావున క్రీడాకారులు ఎన్రోల్మెంట్ చేసుకోవడానికి కింది నెంబర్లను సంప్రదించగలరూ 7731065010 సంప్రదించగలరు.



## విద్యార్థులకు జామెట్రిక్ బాక్సుల వితరణ

**(కరీంనగర్)**

ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాల కరీంనగర్‌లో తొమ్మిదవ మరియు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పానుగంటి కనిష్క్ జన్మదినం సందర్భంగా 65 మందికి జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్ జామెట్రిక్ బాక్సుల వితరణ చేసారు. గత 12 సంవత్సరాలుగా మేము సైతం స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న వారికి చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ చాంద్, ఉపాధ్యాయులు జూపల్లి జగదీశ్వర్ రావు, తవుటు లింగారెడ్డి ,మ్యాదారపు వసుందర, జక్కు కృష్ణమూర్తి గౌడ్ , అనసూరి నటరాజు, మాలోతు ప్రవీణ్, పోలోజు పద్మజ,కోట మాధురి,పల్లె తిరుపతి రెడ్డి, జేరిపోతుల దివాకర్, ఫయాజ్ ఆలీ,సూర్యనారాయణ రెడ్డి, శివాజీ,రాజు, హరికృష్ణ, ఠాగూర్, సంపత్, సునంద బాలయ్య,సునంద, ఆనందం,తిరుపతి, ప్రకాష్,పవన్, రఘు,రజిత తదితరులు పాల్గొన్నారు..



## గన్నేరువరం గ్రామ సభలో గందరగోళం

**సిద్దిపేట**

గన్నేరువరం మండల కేంద్రము తో పాటు పలు గ్రామాల్లో జరిగిన గ్రామ సభలలో కూడా గందరగోళం ఏర్పడింది. తప్పులతడకగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితా ల్లో పేర్లు లేని అర్హులు ఆగ్రహం ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని జాబితాల్లో అనర్హులకే చోటు కల్పించాలని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను నిలదీశారు. అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అర్హులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని అధికారులు చెప్పడంతో ఆందోళన, ఆగ్రహం సద్దుమణిగింది.

# విద్యార్థులే భావి భారత నిర్మాతలు

ఖమ్మం: విద్యార్థులే భావి భారత నిర్మాతలు.. వారు చదువుకునే బడులు బాగుంటే బోధన మెరుగుపడుతుందని జిల్లా పాలనాధికారి నమ్మారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి బడులను బాగు చేసేందుకు నడుం బిగించారు. 'అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ'లకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఇప్పుడు పాఠశాలలు నూతన హంగులు సమకూర్చుకుంటున్నాయి. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక చొరవతో డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్టు(డీఎంఎఫ్‌టీ) నుంచి రూ.172.02 కోట్లు విడుదలయ్యాయి. ఖమ్మం పాఠశాలలు రాష్ట్రానికే ఆదర్శంగా రూపుదిద్దుకుంటున్నాయి. సెప్టెంబరు నుంచి నెలకు రూ.57.34 కోట్ల చొప్పున నవంబరు వరకు రూ.172.02 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో శౌచాలయాల నిర్వహణ, పాఠశాల ప్రాంగణాలు, తరగతి గదుల్లో పరిశుభ్రత, డైనింగ్ హాల్ నిర్వహణ, పచ్చదనం వంటి పనులు చేస్తున్నారు. తిరుమలాయపాలెం మండలం బచ్చోడు, తల్లాడ మండలం మిట్టపల్లి, ముదిగొండ మండలం వల్లభి, ఎర్రుపాలెం మండలంలో మీనవోలు తదితర పాఠశాలల్లో ఆకు కూరలు పండిస్తున్నారు. దీంతో ఆయా పాఠశాలల ఆవరణలు కళకళలాడుతున్నాయి. తోటకూర, గోంగూర, పాలకూర, కొత్తిమీర, వంకాయలు, బీరకాయలు, దోస వంటివి సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో వీటినే ఉపయోగిస్తున్నారు. ఖాళీ సమయాల్లో బాలబాలికలు తోట పని చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని రోటరీనగర్, శాంతినగర్, రాజేంద్రనగర్ ఉన్నత పాఠశాలలతో పాటు మల్లెమడుగు, పాండురంగాపురం తదితర పాఠశాలల్లో విశాలమైన డైనింగ్ హాళ్లు నిర్మించారు. వీటికి అవసరమైన స్టీలు బల్లలను, టేబుళ్లను సరఫరా చేశారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత పరిశుభ్రంగా ఉండేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. హాళ్లు కళకళలాడుతున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో శౌచాలయాలు నిర్మించి నీటి సరఫరా ఏర్పాటు చేశారు. ఇంటిని తలపించేలా నిర్మించడం విశేషం. సమీపంలోనే మొక్కలు నాటారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.సోమశేఖరశర్మ, సెక్టోరియల్ ఆఫీసర్ రామకృష్ణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# ఒక్కో ఈ-కారుకు రూ.3.14 లక్షల ఆదా!

## ద్విచక్రవాహనానికి రూ.11 వేలకు పైగా..

## 44 రోజుల్లో ఈవీల కొనుగోలుదారులకు దక్కిన రాయితీ

## రాష్ట్రంలో నూతన పాలసీ ప్రయోజనాలు



(హైదరాబాద్)

ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు) ఇంధన వ్యయాన్ని, కాలుష్యాన్ని తగ్గించడమే కాదు.. కొనుగోలుదారులకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ల ఖర్చులనూ గణనీయంగా ఆదా చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈవీల నూతన పాలసీ రాష్ట్రంలో 2024 నవంబరు 18 నుంచి అమల్లోకి వచ్చింది. డిసెంబరు 31 వరకు.. అంటే 44 రోజుల వ్యవధిలో 8,497 ఎలక్ట్రిక్ వాహనాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ మేరకు ఆయా వాహన యజమానులకు రూ.69.74 కోట్ల పన్నులు, ఫీజుల్ని రాష్ట్ర ప్రభుత్వం మినహాయించింది. ఎలక్ట్రిక్ కార్లు కొన్నవారికి రిజిస్ట్రేషన్ సమయంలోనే సగటున రూ.3.14 లక్షల వరకు.. ద్విచక్రవాహనాలు కొన్నవారికి సగటున రూ.11 వేలకు పైగా ఆదా అయింది.

**ఆదాయం కంటే ఆరోగ్యమే ముఖ్యం..** ఈవీలకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ల రుసుములను మినహాయించడం ద్వారా రవాణాశాఖ సగటున రోజుకు రూ.1.57 కోట్ల ఆదాయాన్ని కోల్పోతోంది. ఈ మేరకు ఏడాదికి దాదాపు రూ.570 కోట్ల ఆదాయాన్ని కోల్పోయే అవకాశం ఉందని అంచనా. 2026 డిసెంబరు 31 వరకు అంచనా వేస్తే.. ఈ మొత్తం రూ.1,200 కోట్లు దాటే అవకాశం ఉంది. దిల్లీలో వాయు కాలుష్య సమస్య తీవ్రంగా ఉంది. ఒక్కోసారి పాఠశాలల్ని కూడా మూసివేయాల్సి వస్తోంది. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రాకూడదన్న ఉద్దేశంతోనే ఈవీల వాడకాన్ని ప్రోత్సహించేందుకు కొత్త పాలసీని తెచ్చి అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నవంబరులోనే ప్రకటించారు. ఆదాయం కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని స్పష్టం చేసిన ప్రభుత్వం ఈవీలు కొనేవారికి రోడ్ ట్యాక్స్‌ను, రిజిస్ట్రేషన్ల రుసుమును మినహాయిస్తోంది.

వ్యక్తిగతంగా వాహనాలు కొనుగోలు చేసేవారికి రోడ్ ట్యాక్స్‌ను 15 ఏళ్లకు ఒకేసారి వాహన రిజిస్ట్రేషన్ సమయంలో వసూలు చేస్తారు. ఈ మేరకు వ్యక్తిగత ఎలక్ట్రిక్ వాహనం కొనేవారికి నూతన పాలసీ కింద రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు పెద్దమొత్తంలో ఒకేసారి మిగులుతుంది. ఎలక్ట్రిక్ ఆటోలు, బస్సులు వంటి రవాణా వాహనాలకు త్రైమాసిక పన్నురూపంలో 15 ఏళ్ల వరకు విడతలవారీగా ఆ ప్రయోజనం లభిస్తుంది. 2024 నవంబరు 18 నుంచి డిసెంబరు 31 వరకు 6,126 ద్విచక్రవాహనాలు, 1,726 ప్రైవేటు కార్లు.. అలాగే 645 ట్యాక్సీలు, ఆటోలు, బస్సులు, గూడ్సు వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. వీటిలో వ్యక్తిగత వాహనాలకు సంబంధించి ద్విచక్రవాహనాలకు గాను రూ.7.21 కోట్లు, ప్రైవేటు కార్లకు రూ.54.14 కోట్లు ఆదా అయింది.

# సుల్తానాబాద్ క్రీడా ఖ్యాతిని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లడంలో బిరుదు రాజమల్లు చేసిన కృషి మరువలేనిది : ముత్యాల రవీందర్

పెద్దపల్లి



సుల్తానాబాద్ క్రీడా ఖ్యాతిని నేడు ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లడంలో స్వర్గీయ పెద్దపెల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు చేసిన కృషి మరువలేనిదని సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రవీందర్ అన్నారు, సుల్తానాబాద్ లో ఆయన మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఉన్న సందర్భంలో పెద్దపెల్లి శాసన సభ్యులుగా సుల్తానాబాద్ కు చెందిన దివంగత బిరుదు రాజమల్లు క్రీడారంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, క్రీడారంగానికి క్రీడాకారులకు ప్రోత్సాహం అందించిన ఆయన ఉమ్మడి జిల్లాలోనే తొలి స్పోర్ట్స్ క్లబ్ ను ఏర్పాటు చేసి సుల్తానాబాద్ క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. సుల్తానాబాద్ క్రీడా ఖ్యాతి నేడు ప్రపంచ స్థాయికి వెళ్లడంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ నెల 24న ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహావిష్కరణ సుల్తానాబాద్ మున్సిపల్ చౌరస్తాలో పెద్దపెల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని ఒలంపిక్ క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీలు, పీడీలు, క్రీడా విశ్లేషకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, క్రీడా విలేకరులు హాజరై విజయవంతం చేయాలని ముత్యాల రవీందర్ కోరారు..

# ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం



పెద్దపల్లి

మంథని పట్టణం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలురు)లో ప్రిన్సిపాల్ శ్రీనాథ్ అధ్యక్షతన బుధవారం ఇండియ లిటరసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై కెరీర్ గైడ్ కోట కిషోర్ బాబు విద్యార్థులకు పదవ తరగతి తరువాత వివిధ కోర్సులు,విద్య అవకాశాలు ,పలు అంశాలు పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ మాట్లాడుతూ పదవ తరగతి తరువాత ఏమిటి అనే సందేహంతో ఉన్న ప్రతి విద్యార్థి కి ఒక దిశ నిర్దేశం చేసేలా విద్యార్థులకు కోర్సులు గురించి తెలియ చేయడమే కాకుండా విద్యార్థులు కు ఎప్పుడు అందుబాటు ఉండేందుకు డిజిటల్ రిసోర్స్ అయిన చాట్ బోట్ నంబర్, హెల్ప్ లైన్ నంబర్ , వెబ్సైట్ ఉపయోగించి కెరీర్ పై మరింత అవగాహన పెంచుకోవడానికి ఈ ప్రోగ్రాం ఎంతో ఉపయోగకరంగా ఉంది అని తెలిపినారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఇండియా లిటరసీ ప్రాజెక్టు వారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సరిత, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ రమేష్, ఉపాధ్యాయులు స్వామి, డాక్టర్ సుధాకర్, హెల్త్ సూపర్వైజర్ కృష్ణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొండంత అక్రమం..! గోరంత స్వాధీనం..?



కొత్తగూడెం:ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు పక్కదారి పడుతున్నాయి. ఏడాది పాటు జరిగిన పనులకు సంబంధించి నిర్వహించే సామాజిక తనిఖీలు తూతూమ ంత్రంగా సాగుతున్నాయి. తనిఖీ బృందాలు రూ.లక్షల్లో అవినీతి జరిగిందని నివేదికలు రూపొందిస్తుంటే.. వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. అవినీతి సొమ్ము రికవరీలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతూ అక్రమార్కులపై ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. సామాజిక తనిఖీలు చేపట్టడంలోనూ అవినీతిపరులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా.. సామాజిక తనిఖీల్లో వెలికితీసే అక్రమాల విలువ కంటే సమావేశాలు, క్షేత్రస్థాయి పర్యటనలకే ఎక్కువ ఖర్చువుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదిలో జరిగిన ఉపాధి పనులపై గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి అక్రమాలను వెలికితీస్తారు. ఒక్కో మండలంలో ఎంతమొత్తం పక్కదారి పట్టిందో తనిఖీ బృందాలు ప్రాథమిక నివేదిక రూపొందిస్తాయి. కొన్ని మండలాల్లో ప్రాథమికంగా రూ.లక్షల్లో అవినీతి జరిగిందని గుర్తించినా రికవరీ విషయానికి వచ్చే సరికి రూ.వేలల్లో ఉండటం గమనార్హం. ఉన్నతాధికారుల పునఃపరిశీలన తర్వాత మొత్తం విలువను పూర్తిగా తగ్గించేస్తున్నారు. కొందరు టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పెద్దమొత్తంలో అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నా.. ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం ఉపాధి హామీ పథకం అక్రమాలకు అడ్డాగా మారింది. ఇటీవల జరిగిన 15వ సామాజిక తనిఖీలో పెద్దఎత్తున అవినీతి వెలుగుచూసింది. 24 గ్రామ పంచాయతీల్లో ఉపాధి, అటవీ, పంచాయతీరాజ్‌శాఖల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి సిబ్బందికి రూ.1,39,000 జరిమానా విధించటంతో పాటు రూ.10,36,271 రికవరీ చేయాలని డీఆర్‌డీఓ శిరీష ఆదేశించారు. ఎక్కువగా డబుల్ జాబ్‌కార్డులు, బినామీ, విశ్రాంత ఉద్యోగుల పేర్లపై మస్టర్లు వేసి సొమ్ము కాజేసినట్లు గుర్తించారు. విలువ కంటే సమావేశాలు, క్షేత్రస్థాయి పర్యటనలకే ఎక్కువ ఖర్చువుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదిలో జరిగిన ఉపాధి పనులపై గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటుచేసి అక్రమాలను వెలికితీస్తారు. ఉపాధి హామీ పథకంలో లేబర్ పేమెంట్స్, మెటీరియల్ పేమెంట్స్ అనే రెండు రకాల నిధులుంటాయి. మెటీరియల్(కట్టడాలు, నిర్మాణాలు) కొలతల ప్రకారం ఉంటాయి. కట్టడాలు కంటికి, రికార్డుల ప్రకారం కనిపిస్తుండగా, లేబర్ పేమెంట్స్‌లో పెద్దమొత్తంలో అవకతవకలు జరిగే ఆస్కారముంది. దీనినే ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఆసరా చేసుకొని అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. కూలీలు తక్కువగా హాజరైనా..

ఎక్కువగా నమోదుచేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దుర్వినియోగమైన సొమ్మును సామాజిక తనిఖీల ద్వారా స్వాధీనపర చుకుంటున్నాం. ఉపాధి హామీ నిధులు పక్కదారి పట్టించిన వారికి నోటీసులు అందిస్తున్నాం. అవినీతికి పాల్పడిన ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తున్నాం. నుంచి రావాల్సిన సొమ్ముకావటం లేదు.

# గంటల వ్యవధిలో పోలీసులకు పట్టుబడిన చైన్‌స్నాచర్




**హనుమకొండ**గంటల వ్యవధిలో మహిళా వృద్ధిరాలి మేడలో బంగారు గోలుసు చోరీ చేసిన దొంగను హనుమకొండ మరియు సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా కల్సి అరెస్టు చేసారు. అరెస్టు చేసిన చైన్ స్నాచర్ నుండి పోలీసులు 3లక్షల 60వేల రూపాయల విలువగల 45 గ్రాముల బంగారు గొలుసు తో పాటు ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు..ఈ అరెస్టుకు సంబంధించి హనుమకొండ ఏసిపి దేవేందర్ వివరాలను వెల్లడిస్తూ వరంగల్ జిల్లా, నర్సంపేట మండల కేంద్రానికి చెందిన ములక విజయ్ కుమార్ (29) హైదరా బాద్‌లోని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద కారు డ్రైవర్ పనిచేస్తూ డబ్బు సంపాదించే వాడు. నిందితుడు ఇదే సమయంలో మద్యానికి బానిసగా మారడంతో చేడు వ్యసనాలకు బానిస ఆయ్యా డు. తనకు వచ్చే అదాయంతో తన జల్సాలకు సరిపోకపోవడంతో నిందితుడు స్నేహి తులు, పరిచయస్తుల వద్ద అప్పులు చేస్తూ జల్సాలు చేసేవాడు. ఈ క్రమంలో అప్పు ఇచ్చిన వారు ఇచ్చిన డబ్బు తిరిగి ఇవాల్సిందిగా నింది తుడిపై ఒత్తిడి తీసువస్తుం డంతో పాటు, ఇదే విషయంలో నిందితుడుకి భార్యతో గోడవలు జరగడంతో సులభం గా డబ్బు సంపాదించాలను కున్నాడు.

# యూనిఫైడ్ కౌన్సిల్ జాతీయ స్థాయి జి.కె. ఒలంపియాడ్లో అల్ఫోర్స్ ఇ-టెక్నో విద్యార్థులకు అత్యుత్తమ పతకాలు



(కరీంనగర్)

విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే సామాజిక అవగహన పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉండాలని మరియు తద్వారా వారు అందులో నిపుణులు అవుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో ఏర్పాటు చేసినటువంటి విద్యార్థుల అభినందన సభ కు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలోని అంశాలను సమగ్రంగా విద్యార్థులకు విశ్లేష్ణాత్మకంగా తెలుపాలని తద్వారా వివిద అంశాల పట్ల అవగాహన పెరుగుతుందని మరియు పోటీ పరీక్షలలో పాల్గొనడానికై విశ్వాసం కల్గుతుందని చెప్పారు.

విద్యార్థులకు తరగతిగదుల్లో ప్రతి అంశం గురించి చాలా అవగాహన కల్పిస్తామని మరియు విషయాలను తెలియపర్చడం జరుగుతుందని చెప్పారు. పాఠశాలలో ఇచ్చిన ప్రోత్సాహంతో వివిద పోటీ పరీక్షలకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల కాలంలో యూనిఫైడ్ కౌన్సిల్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి జి.కె. ఒలంపియాడ్లో పాఠశాలకు చెందిన బి. విహార్ 4వ తరగతి, వి. విహాన్ శౌరి 4వ తరగతి, ఎ. అక్షయగ్న 6వ తరగతి, డి. సమ్మితా రెడ్డి, 6వ తరగతి, యం. శివేన్ రెడ్డి, 7వ తరగతి, వి. జయంత్ క్షేత్రజ్ఞ 8వ తరగతి మరియు ఇ. ఆరుష్ పటేల్ 9వ తరగతి పతకాలు సాధించి పై చేయి సాధించారని హర్షం వ్యక్తం చేస్తు ప్రాంగణంలో ఏర్పాటుచేసినటువంటి సభలో శుభాభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్జీకర్ ఘటన.. దోషి వాదన విన్నాకే అప్పీల్‌పై నిర్ణయం : హైకోర్టు



(పశ్చిమ బెంగాల్)

ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కారు కలకత్తా హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అందరి వాదనలు విన్న తర్వాతే ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను పరిగణలోకి తీసుకుంటామని న్యాయస్థానం తెలిపింది. దోషి సంజయ్ రాయ్, సీబీఐ, మృతురాలి కుటుంబ సభ్యుల వాదనలు విన్న తర్వాత ఆ పిటిషన్‌ను స్వీకరిస్తామని స్పష్టం చేసింది. ఈ కేసుపై సోమవారం విచారణ జరుపుతామని తెలిపింది.

కాగా, ఈ కేసులో నిందితుడికి సియాల్దా కోర్టు విధించిన శిక్ష సరిపోదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయడాన్ని సీబీఐ వ్యతిరేకించింది. కేసును విచారించిన సంస్థగా శిక్ష విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు తమకు మాత్రమే ఉందని.. ఇందులో జోక్యం చేసుకొనే అధికారం ప్రభుత్వానికి లేదని పేర్కొంది.

గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన కేసుపై ఇటీవల విచారణ జరిపిన కోల్‌కతాలోని సియాల్దా కోర్టు నిందితుడు సంజయ్‌రాయ్‌కు జీవితఖైదు విధించింది. అలాగే బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదని వ్యాఖ్యానించింది. మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని వివరించింది. దీనిపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ.. ఈ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది.

# కలవర పెడుతున్న కల్తీ ఆహారం..

భోజన ప్రియులు పెరిగారు. ఇంటివంటకన్నా బయట బిర్యానీలు, కరీలకు ప్రాముఖ్యం పెరిగింది. అలాగే కరీపాయింట్స్ పెరిగాయి. రుచికరమైన హోటళు ..అమ్మచేతి వంట అంటూ ప్రచారం సాగిస్తున్నాయి. కానీ ఇలాంటి అనేక హోటళ్లలో పరిశుభ్రత డొల్ల అని ఇటీవల అధికారుల వరుస దాడలతో బట్టబయలు అయ్యింది. పరిశుభ్రత, నాణ్యత అన్నవి పక్కకు పోయాయి. ప్రపంచవ్యాప్తంగా మాంసాహార ప్రియులే ఎక్కువగా ఉంటారు. శాఖాహారం కన్నా మాంసాహారాన్నే చాలా మంది ఇష్టంగా ఆరగిస్తుంటారు.ఆదివారం వచ్చిందంటే చాలు చికెన్ లేదా మటన్ తెచ్చుకోవాల్సిందే. అమ్మ లేదా భార్యతో రుచికరంగా వండించుకుని తినాల్సిందే. ఇటీవల కాలంలో హోటళ్లు విపరీతంగా పెరిగిపోయాయి. స్విగ్గీ, జొమాటో వంటి ఆన్ లైన్ ఎ÷-లాట్ ఫామ్స్ వచ్చిన తర్వాత ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారి సంఖ్య బాగా పెరిగిపోతోంది. ఒక్క క్లిక్‌తో బిర్యానీ ఇంటి ముందుకే రావడంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆర్డర్ పెట్టుకుని తినేస్తున్నారు. అయినా ఆదివారం రోజును అంతా ఎంతో ప్రత్యేకంగా భావిస్తారు. ఆ రోజు ఇంట్లో కచ్చితంగా నాన్ వెజ్ ఉడకాల్సిందే. లేదంటే ఏదో వెలితిగా అనిపిస్తుంటుంది. రోజు కచ్చితంగా నాన్ వెజ్ తినాల్సిందే అనే విధంగా పరిస్థితి తయారయ్యింది. ఇదే అదనుగా అనేకులు హోల్ బిజినెస్ రంగంలోకి దిగారు. రుచికరమైన, శుచికరమైన వంట అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ బొద్దింకలు, వెంట్రుకుల, మేకులు, జెర్రీలు ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువులు , ప్రాణులు బిర్యానీల్లో దర్శనమిస్తున్నాయి. మాంసాహార ప్రియులకు ఆదివారం ప్రత్యేకమైన రోజు. చాలా దేశాల ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు స్థానిక చట్టాల ప్రకారం తమ ఉద్యోగులకు వారానికి ఓ రోజు ఇవ్వాల్సిన సెలవు దినాన్ని ఆదివారంగా ఎంచుకున్నారు. వారం మొత్తం కష్టపడి పని చేసిన ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడి, శరీర అలసటతో ఉంటారు. ఆ ఒక్కరోజు మాత్రం కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతుంటారు. అయితే మానవజాతి ఆవిర్భావం నుంచి నాన్ వెజ్ తినడానికే మనిషి ఎక్కువగా ఇష్టపడుతుంటాడు. అయితే ఆదివారం రోజున తమ కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడిసే సమయంలో మాంసాహారం ఉంటే ఇంక ఆ మజానే వేరుగా ఉంటుంది. అందుకే ఆదివారం రోజున చికెన్, మటన్, చేప వంటి మాంసాహారాలు తినేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. అలాగే పిల్లలు కూడా పాఠశాలలు, కళాశాలలకు వెళ్తూ వారం మొత్తం బిజీబిజీగా ఉంటారు. ఆ ఒక్కరోజే ఇంటి వద్ద ఉంటారు. అందుకే ఈ రోజున నాన్ వెజ్ తినేందుకు ఎక్కువగా మంది మొగ్గు చూపుతుంటారు. ఈ క్రమంలో ఆదివారాలు హోటళ్లకు గిరాకీ పెరుగుతోంది. సంప్రదాయమే కాలక్రమేనా సంస్కృతిగా మారి పోయింది. ఆదివారం మాంసాహారం తినని కుటుంబం అంటూ ఉండదు. దాదాపు ప్రతిఒక్కరూ ముక్క లేనిదే ముద్ద దిగదు అన్నట్లు ఆదివారాన్ని ప్రత్యేకంగా చూస్తారు. ఆ రోజు నాన్ వెజ్ తీసుకురాకపోతే పిల్లలు పెద్ద యుద్ధమే చేస్తుంటారు. దీంతో ఆదివారం నాన్ వెజ్ తినడం తప్పని సరిగా మారిపోయింది. అందుకే ఆదివారం నాడు చికెన్, మటన్ షాపుల ముందు ప్రజలు పెద్దఎత్తున బారులు తీరుతుంటారు. అదేరీతిలో హోటళ్లు కూడా కిక్కిరిసి పోతున్నాయి. ముందే ఆర్డర్ ఇవ్వడం, రిజర్వ్ చేసుకోవడం తప్పనిసరిగా మారింది. అయితే ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న హోటళ్లు కూడా శుచి, శుభ్రత, నాణ్యత విషయంలో డొల్ల అని తేలింది. వారి కిచెన్‌లను పరిశీలించినప్పుడు పాచిపోయిన, కాలం చెల్లిన పదార్థాలు దర్శనం ఇస్తున్నాయి. హోటళ్లు, ఫుట్‌పాత్‌లపై నోరూరించే, ఘుమ ఘుమలాడే వంటకాల వెనక అనేక నాసిరకం ఆహార పదార్థాలు దాగి ఉంటున్నాయి. కనీస ప్రమాణాలు పాటించకుండా మాంసాహారాన్ని నిల్వ ఉంచుతున్నారు. వాటికే రంగులద్ది మళ్లీ మళ్లీ నూనెలో వేయించి,వేడివేడిగా పొగలు కక్కిస్తూ వడ్డిస్తున్నారు. పలు చోట్ల రోగాల బారిన పడిన జంతువుల మాంసాన్ని సైతం వినియోగించిన ఘటనలు వెలుగు చూశాయి. నాసిరకం నూనెలు, అనుమతి లేని రంగులను మితిమీరి వాడుతున్నారు. కల్తీ ఆహారం వల్ల అతిసారం నుంచి క్యాన్సర్ల వరకు దాదాపు 200 రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతా యని వైద్య నిపుణులు హెచ్చరి స్తున్నారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు. ఆహార పదార్థాల తయారీలో రుచి, రంగు కోసం హానికరమైన రసాయనాలు, రంగులను కలుపు తుండడంతో దేశంలో సుమారు 10 కోట్ల మంది వివిధ వ్యాధులతో బాధ పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 2030 నాటికి ఈ సంఖ్య 15 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. వంట నూనెల నియంత్రణ చట్టం-1947, నిత్యావసర సరకుల నియంత్రణ చట్టం-1955, పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం-1992 వంటివి క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలుకు నోచుకోవడంలేదు. ఆహారం కల్తీ చేయటం, నాసిరకం పదార్థాలు అమ్మటం నేరమని ఆహార భద్రతా ప్రమాణాల చట్టం-2006 చెబు తున్నది. ఆహార కల్తీ నిరోధక చట్టం-1954 కఠిన శిక్షలను నిర్దేశిర చింది. ఆహార, పానీయాలను కల్తీ చేసి అమ్మేవారికి ఆరు నెలల తప్పనిసరి జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించాలని పార్లమెంటరీ ప్యానెల్ సైతం ఏడాది క్రితం సిఫారసు చేసింది. అయితే హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తూ.. కలుషిత ఆహారాన్ని గుర్తిస్తున్నా.. వారికి శిక్షలు మాత్రం పడడం లేదు. జరిమానాలతో బయటికొచ్చి మళ్లీ అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం నాసిరకం ఆహారం అని తేలితే జాయింట్ కలెక్టర్ సమక్షంలో నేరస్తుడిని ప్రవేశపెట్టి జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష వేసే అవకాశం ఉంది. సబ్ స్టాండర్డ్ కేసుల్లో రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకూ జరిమానా చెల్లించి నేరస్తులు బయట పడుతున్నారు. కల్తీ ఆహారం అని తేలితే క్రిమినల్ కేసు బుక్ చేయాలి. వారికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష విధించే అవకాశంఉంది. ఒకవేళ కల్తీఆహారం తినిఎవరైనా చనిపో యినట్లు నిరూపించగలిగితే గరిష్టంగా ఏడేళ్ల శిక్ష విధించేందుకు చట్టంలో సెక్షన్లున్నాయి.ఇన్ని శిక్షలున్నా కల్తీ నిరాఘాటంగా జరిగిపో తూనే వుంది. కల్తీఆహారానికిసంబంధించి ప్రభుత్వాలు కదలాలి. నిఘా పెరగాలి. తనిఖీ నిరంతరం కొనసాగాలి. కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రజలలో సైతం చైతన్యం పెరగాలి. అప్పుడే ఈ కల్తీకి కళ్లెం వేయగలం అని గుర్తించాలి. అందుకే భోజన ప్రియులు ఇవన్నీ గుర్తించి తినడం మంచిది. లేకుంటే లేని రోగాలను, క్యాన్సర్‌లను కొని తెచ్చుకోవడం జరుగుతుంది.

# పేద బిడ్డలకు ల్యాప్‌టాప్స్ ఏవి..?



హైదరాబాద్ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది గౌలిదొడ్డి(బాయ్స్) గురుకులంలో చదువుతూ ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ అందించేవారు. కానీ ఈ ఏడాది మాత్రం ఇప్పటి వరకు విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ అందలేదు. గొప్ప చదువులు చదవాలనుకునే గురుకుల విద్యార్థులు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. అయితే తమకు ల్యాప్‌టాప్స్ అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ.. మాజీ ఐపీఎస్ ఆఫీసర్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు గురుకుల విద్యార్థులు ఓ మేసేజ్ చేశారు. ఈ మేసేజ్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. మీరు హైదరాబాద్ నుండి కరీంనగర్‌కు హెలికాప్టర్‌లో పోయిన ఖర్చుతో ఈ పేద బిడ్డలకు మంచి ల్యాప్‌టాప్స్ పంపిణీ చేయవచ్చు. రూ. 32 వేల ప్లేటు మీల్స్ గురించి నేను మాట్లాడను అని రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చురకలంటించారు.

ఇక విద్యార్థులు పంపిన మేసేజ్ సారాంశం ఏంటంటే..

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సర్.. మేం టీఎస్‌డబ్ల్యూఆర్ సీవోఈ గౌలిదొడ్డి(బాయ్స్)కి చెందిన విద్యార్థులం. మేం ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించాం. మా ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. దీంతో మేం సొంతంగా ల్యాప్‌టాప్స్ కొనలేని పరిస్థితి ఉంది. ప్రతి ఏడాది ఎన్ఐటీ, ఐఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు గురుకుల సొసైటీ ల్యాప్‌టాప్స్ అందజేసేది. ఈ ఏడాది అది జరగలేదు. పాత ల్యాప్‌టాప్స్‌ను కొంతమంది విద్యార్థులకు పంపిణీ చేశారు. అవి కూడా సరిగా పని చేయడం లేదు. మరో 23 మందికి ఇప్పటి వరకు ఎలాంటి ల్యాప్‌టాప్స్ అందలేదు. ఈ క్రమంలో సొసైటీ నుంచి ల్యాప్‌టాప్స్ అందేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నట్లు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అభ్యర్థించారు.

# పెళ్లింట్లో చోరీ.. రూ. 3.50 కోట్ల బంగారు ఆభరణాలు అపహరణ



అమరావతి : ఏపీలోని అనంతపురం జిల్లాలో ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. కూతురు పెళ్లి కోసం దాచిన నగదుతో పాటు రూ. 3.50 కోట్ల విలువ చేసే బంగారం, వజ్రాలను దొంగలు దోచుకెళ్లారు. అనంతపురం నగర శివారులో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకట శివారెడ్డి అనే వ్యక్తి నగర శివారులోని బెంగుళూరు హైదరాబాద్ జాతీయ రహదారి సమీపంలోని విల్లాస్‌లో ఉంటున్నాడు. వచ్చే నెల ఫిబ్రవరిలో కుమార్తె పెళ్లి ఉండడంతో బీరువాలోని రూ.20లక్షల నగదుతో పాటు, రూ.3.50కోట్ల విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలు లాకర్‌లో ఉంచాడు. పెళ్లి కార్డులు బంధువులకు ఇవ్వడానికి వేరే ప్రాంతానికి వెళ్లగా అదును చూసిన దొంగలు ఇంట్లో చొరబడి లాకర్‌ను పగులగొట్టారు. లాకర్‌లో ఉన్న నగదును, బంగారాన్ని, వజ్రాలను దోచుకెళ్లారు. వాచ్‌మెన్ సమాచారంతో ఇంటికి వచ్చిన బాధితుడు లాకర్ పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల్లో ఫుటేజీని పరిశీలించగా నలుగురు దొంగలు దోపిడికి పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. అంతకు ముందు అదే విల్లాలోని మరో రెండు ఇళ్లలోకి చొరబడి దోపిడికి పాల్పడ్డారు.

# కొడుకు ఇంటి పన్ను కట్టలేదని.. తల్లికి వృద్ధాప్య పెన్షన్ కట్..



హైదరాబాద్ : కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. పెన్షన్లలో కోతలు విధించడమంటే.. వారి నోటికాడి బుక్కను లాగేసుకోవడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీలో కొడుకు ఇంటి పన్ను కట్టలేదని తల్లి వృద్ధాప్య పెన్షన్‌లో కోత విధించిన ఘటనపై హరీశ్‌రావు స్పందించారు.

%కొడుకు ఇంటి పన్ను కట్టకుంటే, తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్ ఆపడం అన్యాయం, అమానుషం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయి. పింఛన్ డబ్బులను కూడా ఇంటి పన్ను కింద జమ చేసుకుంటే, ఆ వృద్ధుల బతుకు బండి నడిచేది ఎట్ల? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

అధికారంలోకి వస్తే ప్రతి నెలా రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వచ్చే రూ. 2 వేల పింఛన్‌ను గుంజుకోవడం దుర్మార్గమైన చర్య అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఒకవైపు లబ్ధిదారుల్లో కోత విధిస్తూ, మరో వైపు చేతికందిన పింఛన్‌ను ఇంటి పన్ను బకాయిలో జమ చేయడం శోచనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీ పరిధిలో 15 మంది వృద్ధులకు వెంటనే పింఛన్లు చెల్లించాలని, ఇంటిపన్ను, ఇతర కారణాలు చెప్పి పింఛన్లు ఆపకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ఏపీ హైకోర్టులో 30కు చేరిన న్యాయమూర్తుల సంఖ్య



అమరావతి : ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య పెరిగింది. తాజాగా మరో ఇద్దరు న్యాయమూర్తులను నియమించడంతో ఆ సంఖ్య 28 నుంచి 30కు చేరుకుంది. రాష్ట్ర హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా అవధానం హరిహరనాథ శర్మ , డాక్టర్ యడవల్లి లక్ష్మణరావును నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది మూర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ ఇద్దరు శుక్రవారం అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణం చేసే అవకాశముంది. %రాష్ట్ర హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తులకు గాను ప్రస్తుతం 28 మంది పనిచేస్తున్నారు. ఇద్దరి నియమకంతో ఆ సంఖ్య 30కు చేరుకోగా మరో 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. . వీరు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు అదనపు న్యాయమూర్తులుగా , ఆతరువాత శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులవుతారు. న్యాయాధికారుల కోటా నుంచి వీరి పేర్లను సుప్రీంకోర్టు సీజే నేతృత్వంలోని కొలీజియం సిఫారస్ చేస్తూ ఈనెల 11న తీర్మానం చేసింది.

# ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా సహకరించాలి : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్ : నగరంలో ట్రాఫిక్‌కుఇబ్బందులు కల్పిస్తే చర్యలు తప్పవని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌అన్నారు. గురువారం మోండా మార్కెట్, రాంగోపాల్ పేట, బేగంపేట డివిజన్‌లో పర్యటించారు. ఫుట్ పాత్ వ్యాపారులతో సమావేశమై పలు పూసూనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధికారులు నిర్దేశించిన స్థలాల్లోనే వ్యాపారాలు జరుపుకోవాలన్నారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలన్నారు. రోడ్లపైకి వచ్చి ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తే అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఫుట్ పాత్ వ్యాపారులు అధికారులకు సహకరించాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

# టీటీడీకి విరాళంగా కియోస్క్ యంత్రం అందజేత

టీటీడీకి విరాళంగా కియోస్క్ యంత్రం అందజేత

తిరుపతి : తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(కియోస్క్ యంత్రాన్ని విరాళంగా అందించింది. క్యూ ఆర్ కోడ్ యంత్రంతో యూపీఐ మోడ్‌లో రూ. లక్ష వరకు భక్తులు విరాళంగా అందజేయవచ్చని అధికారులు వివరించారు.

ఇప్పటికే ఎస్‌బీఐ 5 కియోస్క్ యంత్రాలను అందించగా, వాటిని తిరుమల, తిరుపతి, దేవుని కడపలలో టీటీడీ వినియోగిస్తోంది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణ రెడ్డి, ఎస్‌బీఐ డీజీఎం లేఖా మీనన్, ఆర్ ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 6 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 62,223 మంది భక్తులు దర్శించుకోగా 19,704 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు మొక్కుల ద్వారా చెల్లించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.10 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.



# భార్యకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన డొనాల్డ్ ట్రంప్..



అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ తన 20వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా తన భార్య, అమెరికా ఫస్ట్ లేడీ మెలానియా ట్రంప్ కు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో త్రోబ్యాక్ వెడ్డింగ్ ఫొటో ను షేర్ చేశారు.

'నా అందమైన భార్య మెలానియాకు 20వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు' అంటూ ట్రంప్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు తమ పెళ్లినాటి ఫొటోను జతచేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఇది చూసిన పలువురు ప్రముఖులు, నెటిజన్లు ట్రంప్-మెలానియా దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# ఓటేసేందుకు పోలింగ్ బూత్‌కు మాజీ సీఎం



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి. 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 43 మున్సిపాల్టీలు, 46 నగర పంచాయితీలకు ఇవాళ పోలింగ్ జరుగుతోంది. ఆ ఎన్నికల్లో ఓటేసేందుకు ఆ రాష్ట్ర మాజీ సీఎం హరీశ్ రావత్. డెహ్రాడూన్‌లో ఓ పోలింగ్ బూత్‌కు వెళ్లారు. కానీ ఓటర్ల జాబితాలో ఆయన పేరు కనిపించలేదు. వాస్తవానికి 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన డెహ్రాడూన్‌లోని నిరంజన్‌పూర్ ఏరియా నుంచి ఓటేశారు. అయితే ఈసారి మాత్రం ఆ ప్రదేశం నుంచి ఆయన ఓటు వేయలేకపోయారు. ఓటరు లిస్టు నుంచి ఆయన పేరు గల్లంతు అయినట్లు అధికారులు వెల్లడించారు. 2009 నుంచి ఆ సీనియర్ కాంగ్రెస్ నేత నిరంజన్‌పూర్ నుంచే ఓటేస్తున్నారు. ఓటర్ల జాబితా నుంచి పేరు గల్లంతు అయిన అంశంపై హరీశ్ రావత్ స్పందించారు. ఇవాళ ఉదయం నుంచి ఓటు వేసేందుకు నిరీక్షిస్తున్నానని, కానీ పోలింగ్ స్టేషన్‌లో పేరు లేదని, లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడే ఓటేసినట్లు చెప్పారు. ఓటర్ల లిస్టును బీజేపీ తారుమారు చేసినట్లు ఆయన ఆరోపించారు. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే, కంప్యూటర్ సర్వర్లు మొరాయిస్తున్నట్లు ఈసీ చెప్పిందన్నారు.

# సినీ దర్శకుడు రమేశ్ కృష్ణ మిస్సింగ్?



హైదరాబాద్‌లో మూవీ డైరెక్టర్ ఓం రమేశ్ కృష్ణ అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మియాపూర్‌లోని ఫ్రెండ్స్ కాలనీలో నివాసముంటున్న రమేశ్ కృష్ణ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు రమేశ్ కృష్ణ కోసం వెతికారు. ఎక్కడా కూడా ఆచూకీ లభించకపోవడంతో తన భర్త కనిపించడం లేదంటూ రమేశ్ కృష్ణ భార్య శ్రీదేవి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసింది. తన భర్త ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోలీసులు దర్యాప్తులో భాగంగా ఇండస్ట్రీలో రమేశ్ కృష్ణతో పని చేసిన వారిని, స్నేహితులను విచారిస్తున్నారు.

# పంచాయతీ ఎదుట యువకుడి నిరసన దీక్ష



నల్లగొండ : నాలుగు ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు ఆందోళనలు, పరస్పర దాడులతో మూడో రోజు ఉద్రిక్త వాతావరణంలో కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. తాజాగా నల్లగొండ (%చీుశ్రీశ్రీఱస్త్రశీఅఱ%) జిల్లాలో ఓ యువకుడు నిరసన దీక్ష(%శీbష్ట్ర జూతీశీవర%) చేపట్టాడు. వివరాల్లోకి వెళ్తే.. త్రిపురారం మండలం బెజ్జికల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు అర్హత ఉన్న పేదలకు కాకుండా అనర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వచ్చాయని ఆరోపించారు. మళ్లీ సర్వే నిర్వహించి పేదలకు న్యాయం చేయాలని గ్రామ పంచాయతీ వద్ద నిరసన దీక్ష చేట్టారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు పంపిణీలో పారదర్శకత పాటించకపోతే ఆందోళన ఉధృతం చేస్తానని హెచ్చరించాడు.

# సైఫ్‌ను నిజంగా పొడిచారా?.. లేక నటిస్తున్నాడా?..

## మహారాష్ట్ర మంత్రి అనుమానాలు



ముంబై: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కత్తిపోటుకు గురైన విషయం తెలిసిందే. బాంద్రాలోని అతణ ఇంట్లో ఓ బంగ్లాదేశీ వ్యక్తి పొడిచాడు. లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందిన సైఫ్.. ఆరు రోజుల తర్వాత డిశ్చార్జ్ అయ్యాడు. అయితే ఆస్పత్రి నుంచి సైఫ్ బయటకు వెస్తున్న సమయంలో.. అతను కనిపించిన తీరుపై మహారాష్ట్ర మంత్రి నితేశ్ రాణే(%చీఱ్‌వంష్ట్ర ఖఅవ%) అనుమానాలు వ్యక్తం చేశారు. సైఫ్‌కు ఆరు చోట్ల కత్తి పోట్లు దిగాయి. వెన్నుపూసలో ఏకంగా కత్తిముక్కే విరిగింది. దాన్ని ఆస్పత్రి డాక్టర్లు చికిత్స చేసి తీశారు.

# పటాన్‌చెరు కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు.



సంగారెడ్డి : పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి వ్యతిరేకంగా కాటా శ్రీనివాస్ గౌడ్ వర్గంలోని ఒరిజినల్ కాంగ్రెస్ క్యాడర్ నిరసనకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని బొల్లారంలో పాత కాంగ్రెస్ నాయకులను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి బూతులు తిట్టారని ఆరోపిస్తూ సేవ్ కాంగ్రెస్.. సేవ్ పటాన్‌చెరు స్లోగన్‌తో స్థానిక కార్యకర్తలు, నాయకులు రోడ్డెక్కారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఉన్న కుర్చీలను పగలకొట్టారు. పార్టీ మారి వచ్చిన గూడెం తన అనుచర వర్గం కాంగ్రెస్ నాయకులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. పాత, కొత్త నేతల పంచాయితీ సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేపట్టడంతో పటాన్‌చెరు చౌరస్తా వద్ద భారీగా పోలీసులను మోరించారు.

# అఖండ 2పై ఎస్ థమన్ కామెంట్స్ వైరల్

టాలీవుడ్ యాక్టర్ నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం అఖండ 2 షూట్‌తో బిజీగా ఉన్నాడని తెలిసిందే. బోయపాటి శీను డైరెక్షన్‌లో అఖండ్‌కు సీక్వెల్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మరోసారి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని తెలిసిందే. ఈ సినిమాను 2025 సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. %తాజాగా డాకు మహారాజ్ సక్సెస్ ఈవెంట్‌లో ఎస్ థమన్ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. డాకు మహారాజ్ తీసుకొచ్చి ఇక్కడ ఆపింది. అఖండ 2 ఏం చేస్తుందో నాకు తెలుస్తోంది. అసలు మామూలుగా ఉండదు.. మీరు ముందుగా ప్రిపేర్ అవ్వండి.. అయిపోండి. బోయపాటి మామూలు కసిగా లేదు. ఇంటర్వెల్‌కే మొత్తం డబ్బు ఇచ్చేయొచ్చు. సెకండాఫ్ మనకు అదనపు వినోదమన్నమాట. ఇప్పటి నుంచే ప్రిపేర్ అవుతున్నాం. ఆ సినిమాకు ఎలా చేయాలని ఇప్పటినుంచే చదువుకుంటున్నామంటూ చెప్పుకొచ్చాడు. ఇప్పకీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతూ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి.

బాలయ్య ఆశీస్సులు తీసుకుని..

సంగీతం హిట్టయితే సినిమా సగం హిట్టయినట్టే. ఈయన సినిమా హిట్టవడం కాదు.. ఎక్కడిక్కడ ఎక్కడికక్కడ ఊఫర్లు, స్పీకర్లు బ్లాస్ట్ అవుతున్నాయి. సినిమాను అర్థం చేసుకోవడం వేరు.. మామూలుగా వారి పని నిర్వర్తించడం వేరు. ఇంత కంటెంట్ ఇస్తున్నాం. మరి సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎలా ఉంటుందనే దానికి స్పందన జనం నుంచి కాదు.. ముందు మా నుంచి

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com